# వెలిగే చుక్క

రాస్తున్న పెన్ను బల్లమీద పడేసి, కాగితాలమీద పేపరు వెయిటు పెట్టింది వనజ.

వేళ్లు పీకుతున్నాయి. తలనొప్పి కూడా వస్తున్నట్లుంది. బెల్లు నొక్కింది – ఒకసారి – ఆగి రెండోసారి – సుదీర్ఘంగా వరండా గింగురుమనేట్లు మరోసారి నొక్కింది. ఒకటి రెండు నిమిషాలకు కర్టెను కదిలింది. తెల్లని యూనిఫారం వేసుకున్న పున్నయ్య లోపలికి వచ్చాడు.

"ఏం వినబడలేదా? నిద్రపోతున్నావా? పట్టపగలు నిద్రేమిటోయ్!" అన్నది వనజ ముఖం చిట్లించి. ఈ ప్రశ్నలకు జవాబు వస్తుందని కాదు. పర్సుతీసి రెండు రూపాయలనోటు బల్లమీద పడేసింది. "చూడు కాఫీ తీసుకురా. చక్కెర తక్కువ వేయమను. పానకం పట్టుకురాకు" గట్టిగా చెప్పింది.

అలమార తెరిచి ఫ్లాస్కు తీసుకున్నాడు పున్నయ్య. వినయంగా వొంగి రెండు రూపాయలనోటు తీసుకున్నాడు. అతని ముఖంలో ఏనాడూ పెద్దగా భావం చూడలేదు వనజ. వినయంగా వుంటాడు. మారుమాట లేకుండా చెప్పిన పని చేస్తాడు.

సాయంత్రం నాలుగు గంటలకి ఎవరో వచ్చినప్పుడు – మళ్ళీ పున్నయ్యని టీ కోసం పంపిస్తున్నప్పుడు– "పున్నయ్యా! రేపు వచ్చేటప్పుడు, బజారులో టొమాటాలు ఒక పదికిలోలు తీసుకుని యింట్లో పడేసి రా. ఊరగాయ పెడతానంది వంట మామ్మగారు" అన్నది వనజ. సాధారణంగా పున్నయ్య యిటువంటి పనులన్నీ అందరికీ చేసిపెడుతూంటాడు. పెదవి కొంచెం కదిపాడుగానీ ధ్వని ఏమీరాలేదు.

"టీ తీసుకురా. మళ్ళీ ఆలస్యం చెయ్యకు" అన్నది వనజ. వచ్చిన వాళ్ళు టీ తాగి వెళ్ళాక "టొమాటోలకి ఇరవై రూపాయలిమ్మంటావా?" అన్నదామె. అప్పటికి కప్పులు తీసికెళ్ళి, కడిగి, తుడిచి, అలమరాలో పెట్టి, మళ్ళీ చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు పున్నయ్య.

"రేపట్నుంచి నేను సెలవు పెట్టానండీ. ఇవాళే తెమ్మంటారా మేడం టొమాటోలు" అన్నాడు.

"సెలవా? ఎన్నాళ్ళు"?

"వారంరోజులు పెట్టానండి తమరు మంజూరు కూడా చేశారండి" అని సన్నగా అంటూ చివరి మాట మింగేశాడు.

"ఓహో! వారం సెలవా? పోనీలే ఊరగాయ సంగతి తరువాత చూద్దాం." టేబుల్ మీద ఫైళ్లు సంతకాలు పెట్టవలసినవీ యింకా ఉన్నాయి. వచ్చేపోయేవాళ్లకు సమాధానాలు చెప్పటం మరీ తలనొప్పి వ్యవహారం. అందరితో మర్యాదగా మాట్లాడాలంటే ఎంత కష్టం!

ఐదుగంటలు కావస్తుండగా, పున్నయ్య నమ్రతగా ప్రవేశించి, మొహమాటపడుతూ, ఒక శుభలేఖ వనజ టేబిలు మీద పెట్టాడు. పైన ఆమె పేరు ఇంగ్లీషు అక్షరాలతో ముదురు రంగుల్లో సీతారాములకళ్యాణోత్సవం బొమ్మ, క్రింద శ్లోకం. మరో రంగులో తెలుగులో అచ్చు అక్షరాలు.

"మా అబ్బాయి పెళ్ళి, మా ఊర్లో" అన్నాడు.

వనజ శుభలేఖ తీసుకుని, ఒక్కసారి చూసి, "ఇందుకు సెలవు పెట్టావా?" అన్నది. ఔనన్నట్లు తలూపాడు పున్నయ్య "మంచిది వెళ్ళిరా" అన్నదామె. ఒక్కక్షణం నిలబడి బైటికి వెళ్ళాడతను. మరోసారి పరికించి, ఆఫీసు కాగితాల్లో పడిపోయిందామె.

వారం గడిచింది. సోమవారం వచ్చింది. ఉదయం ఎండ ఆఫీసు ఆవరణలో చెట్టు ఆకుల్లోంచి నేలమీద పడుతుంటే, కిటికీలోంచి చూస్తోంది.

పున్నయ్య వచ్చి, చేతులు కట్టుకుని నిలబడ్డాడు. రెండు రూపాయలనోటు తీసియిస్తూ– "ఈవేళ ఎదురుహోటల్లో పట్టుకురా కాఫీ. మన క్యాంటీన్‌లో పాలు పచ్చివాసన వేస్తున్నాయి"– అన్నది. అతను వెడుతోంటే హఠాత్తుగా జ్ఞాపకం వచ్చి– "ఏమిటీ పెళ్ళి బాగా జరిగిందా? ఎవరి పెళ్ళి అన్నావు? మీ అబ్బాయిదా? అమ్మాయిదా?" అన్నది. శుభలేఖ ఆరోజే బుట్టలో పడెయ్యటం వల్ల గుర్తులేదు ఆ సంగతి.

"అబ్బాయిదండీ! బాగానే జరిగింది మేడం" అన్నాడు పున్నయ్య కళ్ళెత్తకుండానే మామూలుగా చలనం లేని చెక్కబొమ్మలా ఉంటుంది అతని ముఖం. ఈవేళా అట్లాగే ఉంది.

ఒక్కక్షణం నిలబడి బైటికి వెళ్ళాడు కాఫీ తీసుకురావడానికి. టెలిఫోన్లు, కాగితాలు, ఫైల్సు, ఆదివారం పేపర్లు– వీటిల్లో నిమగ్నమైంది వనజ. ఖాళీ కాఫీకప్పు తీసుకువెడుతున్నాడు పున్నయ్య.

"ఏమనుకోకపోతే ఒక మాట మేడమ్" అన్నాడు తలుపు యివతలఆగి.

వనజ తలెత్తి చూసింది ఏమిటన్నట్లు.

"సాయంత్రం మీరు మా ఇంటికి రావాలి మేడమ్."

"ఏం?"

"అబ్బాయి పెళ్ళయింది కదా, చిన్న పార్టీ!"

"అవును కోడలు వచ్చింది కదూ! ఆఫీసులో అందరినీ పిలిచేశావా?" అన్నది వనజ ఆశ్చర్యంగా. "లేదండి! తమరు, లలితా మేడం, ఇందిరామేడం– లేడీస్ మాత్రం." సిగ్గుగా అన్నాడు పున్నయ్య.

"అట్లాగేలే, వాళ్ళతో కూడా చెప్పు" అన్నది వనజ.

'మాటవరసకి కోడల్ని చూపించవా అంటే రమ్మని పిలిచేశాడు పున్నయ్య. ఇప్పుడింక వెళ్ళకపోతే ఏం బాగుంటుంది?" అన్నది స్నేహితులతో మధ్యాహ్నం లంచ్ టైములో వనజ.

"నువ్వు ఏదో ఒకటి తెస్తావు మా ప్రాణానికి. మనం పున్నయ్య యింటికి వెళ్ళడమేమిటి? పార్టీ తినడమేమిటి?" అన్నది లలిత. "మనకి మర్యాదలు చెయ్యాలని గొడవపడతాడు. అనవసరంగా ఖర్చు. ఏదో ఒకటి చెప్పి మానేద్దాం లెద్దూ" అంది ఇందిర. కానీ వనజకే అట్లా చెయ్యటం బాగుండలేదనిపించింది. "ఏదో ఒకటి స్టీలు వస్తువు దోవలో కొనుక్కొని వెళ్ళి యిద్దాం. ఏం చేస్తాం మరి అతను ఆహ్వానించాక?" అన్నది – తనకీ ఇబ్బందిగానే ఉంది నోరు జారి తను మాట్లాడినందుకు పున్నయ్యతో.

మూడున్నరకి పున్నయ్య వచ్చి– "మేడం! ఒక గంట పర్మిషను ఇస్తే నేను యింటికి వెళ్తానండీ! డ్రైవరు భీమయ్యకి గుర్తులు చెప్పాను, మేడం. తీసుకువస్తాడు" అన్నాడు. అతని చెక్కముఖంలో చైతన్యం, సంతోషం ఛాయామాత్రంగా చోటు చేసుకుంటున్నాయి.

"ఎందుకయ్యా అనవసరం శ్రమ. మీ అబ్బాయినీ, కోడల్నీ యిక్కడికి తీసుకురా" అన్నది వనజ.

కాస్త సందేహంగా– "లేదు మేడం! కొత్తకోడలు కదా! బైటికి పంపించరండీ! తమరు రండి" అంటూ ఏం చెప్పాలో తెలియనట్లు నిలబడ్డాడు పున్నయ్య. వనజ సరేనంది.

అయిదున్నరకి ఒక ప్రెజెంట్ కొనుక్కుని విధి లేక బయలుదేరారు వనజ, ఆమె సహోద్యోగులు పున్నయ్య యింటికి.

ఎంత హడావిడి చేసారో వాళ్లయింట్లో కుర్చీలు చక్కగా సర్ది. రెండు బట్టలు వేసి, వాటిమీద ఫలహారాలు, పళ్ళు, కాఫీలు– అన్నీ ఏర్పాటు చేవారు. వధువు ఎర్రని పట్టు చీర కట్టుకుని, తలవంచుకుని, ఒద్దికగా అత్తగారి పక్కన నిలబడింది. వరుడు నలగని కొత్త పాంటు, మెరిసే ఉంగరాలు, గడియారం, కొత్తకళ ఉట్టిపడుతూ హీరోలాగానే అటూ యిటూ తిరుగుతున్నాడు. ఇంట్లో ఉన్న బంధువులు, ఆడవాళ్ళు, పిల్లలు అందరూ గుసగుసలుగా మాట్లాడుతూ– పున్నయ్య ఆఫీసులోని మేడమ్‌లందర్నీ తొంగితొంగి చూస్తున్నారు.

ప్లేట్లలో ఎట్లా అమర్చాలో అన్నీ పున్నయ్య చెబుతుంటే కుర్రాళ్ళు ఒకరిద్దరు అతని ఆజ్ఞానుసారంగా పనులు చేస్తున్నారు.

"రండి మేడమ్! ఈమె నా భార్య, వాడు రెండో అబ్బాయి. ఈయన వియ్యంకుడుగారు" అంటూ అందర్నీ పరిచయం చేశాడు.

ఉన్న నాలుగు కుర్చీల్లో అతిథులు కూర్చుంటే వధూవరులు నిలబడి ఉన్నారు. వనజకి కొంచెం ఎబ్బెట్టుగా అనిపించింది. "అందరం చాపలమీద కూర్చుంటాం అబ్బాయినీ, అబ్బాయినీ ఈ కుర్చీల్లో కూర్చోమను" అని లేచింది.

"వద్దు మేడమ్– వద్దు మేడమ్" అని ఒకటే బలవంతం పెట్టాడు పున్నయ్య. చివరికి ఎక్కణ్ణుంచో మరో నాలుగు కుర్చీలు తెచ్చి వేశాక పెళ్ళికొడుకు వచ్చి కూర్చున్నాడు.

ఎంతకీ పెళ్ళికూతురు వచ్చి అతని పక్కన కూర్చోటం లేదు. పున్నయ్య కొంచెం బిగ్గరగా 'రా అమ్మాయీ! మేడం చెబుతుంటే రావేం?' అని గద్దించేసరికి వచ్చింది.

వాళ్ళిద్దరికీ చెమ్కీ హారాలు వేయించి ఫోటోలు తీయించాడు పున్నయ్య. ఎంతో చక్కగా, పరిశుభ్రంగా అన్నీ అమర్చి అందరికీ మర్యాదలు చేశాడు.

వనజ కళ్ళకు యిదివరకు ఏవో పొరలు ఉండేవి. మనస్సుకి ఏవో తెరలుండేవి. ఆ తెరల్లోంచి, కళ్ళెత్తని, పెదవి విప్పని, ఎదురుచెప్పని పున్నయ్య ఒక మనిషి కాడు. కాఫీ కప్పులు కడుగుతూ, ఫైల్స్‌మోస్తూ, తన బోటివారు అరిస్తే విని కూడా విననట్లు వినయంగా మసలే పున్నయ్య మనుష్యులఅంచనాల్లో పూర్తి సున్నా, కాదు అరసున్న– అదీకాదు. సరిగ్గా చెప్పాలంటే ఒక చిన్న చుక్కతో సమానం. రేపో మాపో రిటైరయ్యే తమ బోటి అధికారులదృష్టిలో ఆ చుక్కకూడా మాయమైపోతుంది. కానీ ఈరోజు తనకి ఎదురుగా ఉన్న ఈ పున్నయ్య ఒక కుటుంబానికి యజమాని– తెలివితేటలు, పరపతి, అధికారం ఉన్న ఒక బాధ్యత గలవ్యక్తి. కుటుంబంలోని ప్రతి ఒక్కరూ అతని మాటకు విలువ యిచ్చి, అతని నిర్ణయాలకి కట్టుబడి, చెప్పిన ఏర్పాట్లు చేస్తున్నారు. మామగారు వస్తే నిలబడి అణకువగా కోడలు చాటు తప్పుకుంటున్నది. నిజంగా ఆక్షణంలో, ఆ యింట్లో పున్నయ్య ఎంత ముఖ్యమైన వ్యక్తి!

తమ దృష్టిలో చెక్కముఖం పున్నయ్య, ఇక్కడ సర్వాధికారాలూ ఉన్న గౌరవనీయుడు, పూజనీయుడు, ఔను కదా! అతణ్ణి మనిషిగా యిన్నాళ్ళూ గుర్తుంచక పోవటం తన గుడ్డితనం!

ఇంత గుర్తింపు జ్ఞానం ఈ క్షణంలోనే వనజలో కలిగాయి. రమ్మంటే వస్తూ, పొమ్మంటే పోయే పున్నయ్య కూడా సాటి మనిషిగా తన కంటే వయస్సులో, కుటుంబానుభవంలో ఉన్నతుడిగా కనబడ్డాడు. ఒక డిగ్రీ, మరో రెండు వేలు జీతం ఉన్న తనే గొప్ప మనిషిననీ, అవి లేని పున్నయ్య పనికిమాలిన ఒక చిన్నప్రాణి అనీ – అంత కూడా కాదు. ఒక కుర్చీ, బల్లవంటి అచేతన పదార్థం అనీ అనుకోవటం ఎంత పొరపాటు.

అందరు సెలవు తీసుకుని, బయటికి వెళ్ళిపోతోంటే, వనజ రెండుగులు వెనక ఉంది. పున్నయ్య భార్య దగ్గరగా వెళ్ళి– "మీకోడలు చక్కగా కుందనం బొమ్మలా ఉందమ్మా! మీ అబ్బాయి అదృష్టవంతుడు. మా పున్నయ్య చాలా మంచివాడు. ఎప్పటికీ మీరు యిట్లాగే సంతోషంగా ఉండాలి. చెప్పాపెట్టకుండా మేము వచ్చినా ఎంత మర్యాద చేశారు" అని మెచ్చుకుంది.

అప్పుడు పున్నయ్య ముఖంలోని ముడతలు సడలి, బుగ్గలు పూడుకొని, పలువరుస కనీకనిపించకుండా నవ్విన నవ్వు చూసింది వనజ. అతనే కాదు, తనూ ఒక మనిషినే అని గుర్తించిన ఆ రోజు తనకి జన్మలో మరుపురాదు అనుకుంది.